## క్లుప్తంగా

### ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న తొలిదశ ఉద్యమకారుల సంఘం నాయకులు

సూర్యాపేట : 1969 తొలిదశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య సలహాదారు నరేందర్‌రెడ్డిని 1969 ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ, యాస ముత్తారెడ్డి, నరేంద్రుని విద్యాసాగర్ రావు, బంధు రుద్రమ్మ, ధరావత్ కిషన్ నాయక్, జగిని దయానంద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### 'కబడ్డీ' జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం



ప్రభాకర్‌రెడ్డి, నరసింహరావును సన్మానిస్తున్న కబడ్డీ క్రీడాకారులు

సూర్యాపేట అర్బన్ : కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులపైన అల్లం ప్రభాకర్‌రెడ్డి, నామ నరసింహారావును సోమవారం సూర్యాపేటలో అసోసియేషన్ సభ్యులు, కబడ్డీ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఆత్మకూరు మండల అధ్యక్షుడు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కోశాధికారి సైదులు, శెట్టి రామచంద్రరావు, రమేష్, బోళ్ల వెంకట్‌రెడ్డి, గునగంటి వెంకన్న, నకిరే పర్వతాలు, బొల్లికొండ భిక్షం, గఫార్ పాల్గొన్నారు.

### విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటకుండా చూడాలి

సూర్యాపేట అర్బన్ : ప్రభుత్వం చేపట్టే వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నాటే మొక్కలను కరెంటు లైన్ల కింద నాటకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సామాజిక కార్యకర్త వేల్పుల లింగయ్య యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాటిన మొక్కలను సంరక్షించి భావితరాలకు వృక్ష సంపద అందించాలని కోరారు.

### ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : కొమ్మాల గ్రామానికి చెందిన అల్లి మంగమ్మ ఇటీవల మృతి చెందింది. సోమవారం మృతురాలి కుటుంబాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కుంటిగొర్ల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, సైదులు, గోపాల్, లింగయ్య, యుగెందర్, శేఖర్, వాసు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదివాసుల హక్కులను కాపాడాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి : ఆదివాసుల హక్కులను కాపాడాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఆగస్టు 2న మండల కేంద్రంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని ఆదివాసుల హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కన్వీనర్ ఎల్.భద్రయ్య, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చింతరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంలో సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు కందాల శంకర్‌రెడ్డి, తొట్ల ప్రభాకర్‌గౌడ్, రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి, దేసోజు మధు, ఆవుల నాగరాజు, ఎం.వెంకటేశ్వర్లు, డప్పు రామన్న, గడ్డం శ్రీను, తిరుమలేష్, రవి పాల్గొన్నారు.

### నివేదిక పూర్తిచేయాలి

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన అభివృద్ధి పనుల నివేదికలను ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీఓ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఓటరు జాబితాలను సరిచేసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, ఇన్‌చార్జ్ ఎంపీఓ ఇక్బాల్ ఖలీల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నారాయణరెడ్డి

# 'పేట'లో పచ్చదనం వెల్లివిరిసేలా..



సూర్యాపేటలో ఇందిరమ్మ కాలనీలోని నర్సరీలో పెరిగిన మొక్కలు



మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

- వనమహోత్సవంలో భాగంగా మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధికారులు
- ఖాళీ ప్రదేశాలలో నాటి సంరక్షించాలని ప్రజలకు అవగాహన
- కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా నాటేందుకు ప్రణాళిక

సూర్యాపేట అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో ఉత్సాహంగా కొనసాగుతోంది. పర్యావరణ పరిరక్షణ, పట్టణ సుందరీకరణ లక్ష్యంగా మున్సిపల్ అధికారులు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ వన మహోత్సవంలో భాగంగా దాదాపు 9 నర్సరీలలో వివిధ రకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలు, నీడనిచ్చే మొక్కలను పెంచి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా పార్కులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ఖాళీ ప్రదేశాలలో నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధం చేశారు. పట్టణ శివారు ప్రాంతాలైన తాళ్లగడ్డ, ముత్యాలమ్మ గుడి, త్రివేణి ఫంక్షన్ హాల్ వెనుక, హౌసింగ్ బోర్డు, జనగామ ఎక్స్ రోడ్డు, పిల్లలమర్రి, కుడకుడ, బీబీగూడెం, దురాజ్‌పల్లి, ఇందిరమ్మ కాలనీ, కోమటికుంట వంటి ప్రాంతాలలో ప్రత్యేక నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు.

**లక్ష్యం – పంపిణీ వివరాలు..**

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 48 వార్డుల్లో 39,800 నివాస గృహాలు, 1,53,000 జనాభా ఉంది. పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించడం, పర్యావరణాన్ని కాపాడడం లక్ష్యంగా అధికారులు 8,70,000 మొక్కలు నాటాలని నిర్దేశించుకున్నారు. అయితే స్థలం కొరత కారణంగా పట్టణంలోని 9 నర్సరీలలో 2,50,000 మొక్కలను మాత్రమే పెంచగలిగారు. మిగిలిన మొక్కలను కొనుగోలు చేసి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు 1,50,000 మొక్కలను కొనుగోలు చేశారు. వీటిలో రకరకాల పూల మొక్కలు, పండ్ల మొక్కలు, రోడ్లకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు ఉన్నాయి.

**పంపిణీ చేసే మొక్కల రకాలు..**

ప్రజలు తమ ఇంటి ఆవరణలో పెంచుకునేందుకు వీలుగా మందారం, చామంతి, నందివర్ధనం, మల్లె, గులాబీ, కనకాంబరం వంటి పూల మొక్కలను పంపిణీ చేస్తున్నారు. ఖాళీ ప్రదేశం ఉన్నవారికి మామిడి, జామ, దానిమ్మ, ఉసిరి వంటి పండ్ల మొక్కలను అందజేస్తున్నారు. అలాగే, రోడ్లకు ఇరువైపులా నీడనిచ్చేందుకు వీలుగా కానుగ, వేప, గులమోహర్, మహాగని, తెల్లమద్ది వంటి మొక్కలను నర్సరీలలో పెంచి సిద్ధం చేశారు.

**ప్రజలకు అవగాహన..**

మున్సిపల్ అధికారులు వన మహోత్సవంపై ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సూర్యాపేట పట్టణాన్ని మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా మార్చడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నారు.

**కావాల్సిన మొక్కలు తీసుకెళ్లవచ్చు**



ఇళ్ల ఆవరణలో నాటుకునే పూల, పండ్ల మొక్కలను అందరికీ అందుబాటులో ఉండేలా కార్యాచరణ సిద్ధం చేశాం. మొక్కలను పంపిణీకి సిద్ధంగా ఉంచాం. కావలసినవారు వార్డు అధికారులను సంప్రదించి పేరు, వార్డు నంబరు, ఆధార్ సంఖ్య నమోదు చేసుకోవాలి. ప్రతి ఇంటికి కావలసిన ఆరు మొక్కలను వార్డు ఆఫీసర్ల సమక్షంలో పంపిణీ చేస్తాం.

– హనుమంత రెడ్డి, మున్సిపల్ కమిషనర్

## ప్రమాదకరంగా ప్రయాణికుల ప్రాంగణం

- తుమ్మలపెన్‌పహాడ్‌లో కూలేదశలో ఉండడంతో భయాందోళనలో గ్రామస్తులు
- కూల్చివేయాలని అధికారులకు వేడుకోలు



శిథిలావస్థలో ఉన్న బస్‌షెల్టర్

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. అప్పట్లో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపై నిలబడకుండా సౌకర్యంగా ఉండేందుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ సహాయంతో, పార్టీ ఆధ్వర్యంలో ఈ షెల్టర్ నిర్మించారు. కొంతకాలం పాటు ఇది ప్రజలకు బాగానే ఉపయోగపడింది. కాలక్రమేణా బస్సుల సంఖ్య తగ్గడం, ఆటోల వాడకం పెరగడం, రోడ్డు విస్తరణ జరగడంతో ఈ బస్ షెల్టర్‌ను వాడటం మానేశారు. దీంతో అది క్రమంగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. ముఖ్యంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు బస్ షెల్టర్ తడిసి, మరింత ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రమాదకరమైన బస్ షెల్టర్‌ను కూల్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**కూలుతుందని భయంగా ఉంది**

ఎప్పుడో కట్టించిన బస్ షెల్టర్ కావడం, వాడకంలో లేకపోవడంతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. బస్ షెల్టర్ మా ఇంటి పక్కనే ఉండడంతో పిల్లలు అక్కడే ఆడుకుంటున్నారు. ఎప్పుడు కూలుతుందోనని భయం వేస్తుంది. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన బస్ షెల్టర్‌ను కూల్చివేయాలి.

- దొండ వెంకన్న, గ్రామస్తుడు

## పట్టణాభివృద్ధిలో ప్రతి పౌరుడి పాత్ర కీలకం



48వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి



హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

- మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి

సూర్యాపేట అర్బన్ : పట్టణాభివృద్ధిలో ప్రతి పౌరుడి పాత్ర కీలకమని మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి అన్నారు. 100 రోజుల పట్టణ ప్రణాళికలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని 48వ వార్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల సహకారంతోనే పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుదల సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, మున్సిపల్ అధికారులు డీఈ సత్యారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, ఆర్‌ఐలు గౌసుద్దీన్, ఇండ్ల మనోజ్ కుమార్, వార్డు అధికారి యశ్వంత్, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సయ్యద్ సమ్మి, హెల్త్ సిబ్బంది, కాలనీ ప్రతినిధులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

**సెవెన్ స్టార్ హోటల్ తనిఖీ**

పట్టణంలోని సెవెన్ స్టార్ హోటల్‌ను మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటల్‌లో పారిశుద్ధ్యం, నాణ్యత ప్రమాణాలను తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందాల్సిన బాధ్యత హోటల్ యాజమాన్యంపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా హోటల్‌లో కొన్ని చిన్నపాటి లోపాలను గుర్తించి హోటల్ యాజమాన్యానికి తగిన సూచనలు చేశారు. హోటళ్ల నిర్వహణలో నిబంధనలు పాటించకుంటే కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వైభవంగా గోదాదేవి జయంతి వేడుకలు



అర్వపల్లి : వేడుకల్లో పాల్గొన్న భక్తులు



తుంగతుర్తి : రామాలయంలో పూజలు..

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం గోదా అమ్మవారి తిరునక్షత్ర వేడుకలను ఆండాళ్ గోష్టి భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతములతో తిరుమంజన స్నపనం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి అష్టోత్తర శతనామార్చనలు, దివ్య ప్రబంధం సేవాకాలం, పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కార్యనిర్వహణ అధికారి వై. శ్రీనివాస రెడ్డి, ఆండాళ్ గోష్టి భక్త బృందం పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి జయంతిని వైభవంగా నిర్వహించారు. గోదాదేవికి విశేష అభిషేకం, అష్టోత్తర శతనామార్చన, కుంకుమార్చన జరిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆండాళ్ తిరు నక్షత్రం సందర్భంగా సోమవారం గోదాదేవికి భక్తులు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు కాటూరి రామాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి అష్టోత్తర పుష్పార్చన, కుంకుమార్చన జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

### గెలుపునకు కృషి చేయాలి

తిరుమలగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మండల ఎన్నికల కన్వీనర్ కాప రవికుమార్, జిల్లా నాయకుడు మద్ది సంజీవరెడ్డి కోరారు. సోమవారం నూతనకల్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల జనరల్ సెక్రటరీ కప్పల హన్మంతు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పాల్వాయి వెంకటమ్మ, వెంకన్న పాల్గొన్నారు.

## అంతర్జాతీయ హెపటైటీస్ దినోత్సవం



అర్వపల్లి : అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది



తుంగతుర్తి : వెంపటిలో..

అర్వపల్లి : అర్వపల్లిలోని పీహెచ్‌సీలో సోమవారం అంతర్జాతీయ హెపటైటీస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ మాట్లాడారు. హెపటైటీస్ వ్యాధి కలుషితమైన నీరు, కలుషిత ఆహారం, రక్తమార్పిడి వలన వస్తుందని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీహెచ్‌ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ లలిత, నర్సింగ్ అధికారిణి సునీత, డాక్టర్ నిహారిక, ఎల్‌టీ చొక్కయ్య, అనూష, నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

తుంగతుర్తి : అంతర్జాతీయ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రావులపల్లి ఆధ్వర్యంలో సోమవారం వెంపటిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, పీహెచ్ ఎన్‌టీకేఆర్ లక్ష్మి, సిబ్బంది ఈట భూక్యా మౌనిక రాథోడ్, బైన రమ్య, శోభారాణి, హెల్త్ అసిస్టెంట్ గాజుల సోమన్న, యాదగిరి, నవీన్ కుమార్, వెంకట్, ఆకారపు భాస్కర్, ఆశా కార్యకర్తలు యాకమ్మ లక్ష్మి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వినతి




వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : గ్రామాలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకుల హాస్టళ్లలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య అన్నారు. సోమవారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మండల వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీజనల్ వ్యాధుల కారణంగా అనేకమంది అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రవి, పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి పిడమర్తి భరత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## యోగా సాధకుల ఆధ్యాత్మిక వన విహారయాత్ర

అర్వపల్లి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని భానుపురి ఉన్నత యోగా సాధన మండలి, జీవన యోగా శిక్షణ ఆధ్వర్యంలో సోమవారం యోగా శిక్షణార్థులు ఆధ్యాత్మిక వన విహారయాత్రకు వెళ్లారు. తిమ్మాపురం శివారులోని సూర్యక్షేత్రం, క్షేత్రం ఆవరణలోని గుట్ట వెంట ఉన్న కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయం, శ్రీరామకోటి స్థూపాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సప్తరుషి ఆశ్రమం, తెలంగాణ యోగా టీచర్స్ అలయెన్స్ కమిటీ, సనాతన ధర్మపరిరక్షణ అలయెన్స్ కమిటీ వ్యవస్థాపకుడు, చైర్మన్, యోగా గురువు బీరెల్లి చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి జీవి పట్ల ప్రేమ, కరుణ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, అర్చకులు భీంపాండే, అంకిత్‌పాండే, యోగా శిక్షణార్థులు, భక్తులు పాల్గొన్నారు.



తిమ్మాపురం శివారులోని వీరహనుమాన్ ఆలయం వద్ద యోగా సాధకులు, తదితరులు

### ఏపీఎం అజయ్‌కు సన్మానం

పెన్‌పహాడ్ : ఏపీఎం అజయ్‌నాయక్ బదిలీపై గరిడేపల్లి వెళ్లారు. సోమవారం ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో అజయ్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రవి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊట్కూరి మంజుల, నాగమణి, స్త్రీనిధి మేనేజర్ జ్యోతి, సీసీలు పద్మావతి, శైలజ, ఆశా, ఏకస్వామి, వీఓఏల అధ్యక్షుడు దూత శ్రీనివాస్, జయమ్మ, గుడిపూరి శ్రీనివాస్, శాంతకుమారి, అన్నమేరి, విజయ, మమత, సరిత, కవిత పాల్గొన్నారు.

## తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో పనులు



అర్వపల్లి : జీపీ భవన నిర్మాణానికి కలెక్టర్‌తో కలిసి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్



నాగారం : రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, ఎమ్మెల్యే సామేల్



తుంగతుర్తి : రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

- ఎమ్మెల్యే మందుల సామేల్
- కలెక్టర్‌తో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.1500 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మందుల సామేల్ చెప్పారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలిసి సోమవారం జాజిరెడ్డిగూడెంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కుంచమర్తిలో జీపీ భవనం, అడివెంల, బొల్లంపల్లి గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్వపల్లి దేవాలయ అభివృద్ధితో పాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ బీరవోలు సోమిరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, దేవాలయ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, గుడిపల్లి మధుకర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, దాసరి సోమయ్య, కె.అవిలయ్య, శిగ నసీర్‌గౌడ్, జీడి వీరస్వామి, దల్వాయి శ్రీధర్, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నాగారం : ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం ఫణిగిరిలో కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌తో కలసి లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్లు పాలేపు చంద్రశేఖర్, గుడిపాటి సైదులు, సురేందర్‌రెడ్డి, తహసీల్దార్ హరికిషోర్‌శర్మ, ఎంపీడీఓ మారయ్య, డీటీ షాహిన్‌బేగం, సీనియర్ అసిస్టెంట్ షఫీ, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

**విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట**

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. సోమవారం వర్ధమానుకోట గ్రామంలో రూ.4.80కోట్లతో నూతనంగా నిర్మించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలకు సీసీరోడ్డు, ప్రహరీ ఏర్పాటుకు నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్, వైస్‌చైర్మన్ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ యానాల ఇంద్రసేనారెడ్డి, డీఈఈ రమేష్‌కుమార్, జీసీడీఓ పూలన్, తహసీల్దార్ హరికిషోర్‌శర్మ, ఎంపీడీఓ మారయ్య, మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, ప్రత్యేక అధికారిని ఎండీ షిరీన్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, ఎల్మకంటి సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం**

తుంగతుర్తి : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, తహసీల్దార్ దయానందం, ఎంపీడీఓ శేషుకుమార్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు తిరుమల ప్రగడ అనురాధ కిషన్ రావు, దొంగరి గోవర్ధన్, రాంబాబు, అనిల్ కాస్ట్రో పాల్గొన్నారు.

**ఓబీసీ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ**

తిరుమలగిరి : ఆగస్టు 7న గోవాలో జరిగే పదవ జాతీయ ఓబీసీ మహాసభ పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మందుల సామేల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు, వంగరి బ్రహ్మం, శ్యామ్ యాదవ్, యాదగిరి, వెంకన్న, సోమనారాయణ, కిరణ్, ఉపేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## కోర్టు భవనానికి నిధుల మంజూరు హర్షణీయం



తుంగతుర్తిలో పండ్లు పంపిణీ చేస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్

తుంగతుర్తి : హైకోర్టు సిఫారస్ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తుంగతుర్తి సివిల్ కోర్టు భవన నిర్మాణానికి రూ.29 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమని తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ అన్నారు. నూతన కోర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో కోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో కక్షిదారులకు, ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు కారింగుల వెంకటేశ్వర్లు, జిలకర చంద్రమౌళి, సునీల్, రాజారాం నాయక్, సతీష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకాలు ధ్వంసం చేయడం అప్రజాస్వామికం



ధ్వంసమైన శిలాఫలకం

తిరుమలగిరి : అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాలను బీఆర్‌ఎస్ నాయకులు ధ్వంసం చేయడం అప్రజాస్వామికమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం నూతనకల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తాళ్లసింగారంలో నూతన గ్రామ పంచాయతీ భవనం ఆవిష్కరణకు సంబంధించిన శిలాఫలకాన్ని బీఆర్‌ఎస్ నాయకులు ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్స లింగయ్య, తండు సత్యనారాయణగౌడ్, రేణుకశ్రీనివాస్, మరికంటి అంబేద్కర్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలన, సీజనల్ వ్యాధులపై అవగాహన



తాళ్లగడ్డలోని బాలుర గురుకుల కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

సూర్యాపేటటౌన్ : సైబర్ మోసాలు, డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని పట్టణ సీఐ వెంకటయ్య ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం తాళ్లగడ్డలోని తెలంగాణ బాలుర గురుకుల కళాశాలలో సూర్యాపేట పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపల్ విద్యాసాగర్, వైస్ ప్రిన్సిపల్ యాదయ్య, ఎస్‌ఐ ఏడుకొండలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తప్పనిసరి**

తుంగతుర్తి : సీజనల్ వ్యాధులు రాకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ లింగమూర్తి అన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, సిబ్బంది లక్ష్మి, ఫార్మసిస్ట్ శోభారాణి, డాక్టర్ భూక్యా మౌనికరాథోడ్, బైన రమ్య, హెల్త్ అసిస్టెంట్లు గాజుల సోమన్న, యాదగిరి, ఆశాలు యాక లక్ష్మి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

### ముత్యాలమ్మకు బోనాలు

మోతె : మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ బోనాల పండుగను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.